## క్లుప్తంగా...

### రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక


సూర్యప్రకాష్


మహేశ్వరి

మల్లాపూర్: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు అండర్ 17 బాలుర విభాగంలో మల్లాపూర్ మోడ్రన్ హైస్కూల్‌కు చెందిన వెంకట్ దుర్గ సూర్యప్రకాష్, అండర్ 17 బాలికల విభాగంలో మహేశ్వరి ఎంపికయ్యారు. వీరు వనపర్తి జిల్లా, సోలీపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడామైదానంలో జరగనున్న 67వ ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి ఖోఖో క్రీడా పోటీల్లో పాల్గొననున్నారు.

### జర్నలిస్టులు పోరాటాలకు సిద్ధం కావాలి


మాట్లాడుతున్న జర్నలిస్టు సంక్షేమ పోరాట కమిటీ సభ్యులు

గౌతంనగర్: జర్నలిస్టులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ మల్కాజిగిరి జర్నలిస్టు పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గౌతంనగర్ సంక్షేమ సంఘం భవనంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ పని చేస్తున్న ప్రాంతంలో ఇంటి స్థలం ఇవ్వాలన్నారు. కుటుంబానికి ఆరోగ్య భద్రత, పిల్లలకు ఉన్నత ప్రమాణాలతో విద్య, గుర్తింపు ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇవి కొత్త కోరికలు కావని గతంలో పాలకులు ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. దశాబ్దాలుగా మాయ మాటలతో పాలకులు జర్నలిస్టులను దగా చేస్తున్నారని పలువురు సీనియర్ విలేకర్లు ఆవేదన వ్యక్తం చేశారు. దీర్ఘకాలంగా ఆచరణకు నోచుకోని హామీలపై అన్ని రాజకీయ పార్టీలు స్పందించాలని కోరారు. కార్యక్రమంలో మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలో పనిచేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

### మాదిగల యుద్ధ భేరి సభను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్ మాదిగ

హబ్సిగూడ: నవంబర్ 5న ఇందిరా పార్క్ వద్ద మాదిగల యుద్ధ భేరి సభను నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీస్ రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ, మేడి పాపన్న మాదిగ తెలిపారు. ఆదివారం హబ్సిగూడ సుప్రభాత్ హోటల్‌లో ఎమ్మార్పీస్ రాష్ట్ర స్థాయి, ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకు 25 శాతం సీట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శంకర్, గణేష్, శ్రీనివాస్, రమేష్, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ కాంగ్రెస్‌లో ముసలం

- రాజీనామా బాటలో అసంతృప్తులు
- టికెట్ల కేటాయింపుపై తీవ్ర ఆగ్రహం
- రాష్ట్ర స్థాయి నేతలపై ఆగ్రహం

ఉప్పల్: ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీలో ముసలం పుట్టింది. నియోజకవర్గ పరిధిలోని ముఖ్య నేతలు, సీనియర్ నాయకులు వేరువేరుగా రాజీనామాలు చేయడంతో పార్టీ మనుగడ అయోమయంగా మారింది. నిన్నటి వరకు ఎవరికి వారు ప్రచారాల్లో మునిగి తేలగా టికెట్ ప్రకటించడంతో టికెట్ రాని సీనియర్ నేతలు భగ్గుమన్నారు. క్రిమినల్ కేసుల్లో కూరుకు పోయిన వారికి టికెట్ ఎలా కేటాయిస్తారని ప్రశ్నించడంతో పాటు టీపీసీసీ అధ్యక్షుడు అమ్ముడు పోయారని తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు నోటుకు సీటు దందా చేస్తున్నాడని సొంత పార్టీ నేతలు తీవ్ర విమర్శలు చేశారు. ఆయన ఉప్పల్‌లో ఎలా తిరుగుతాడో చూస్తామంటూ హెచ్చరికలు సైతం జారీ చేస్తున్నారు. దశాబ్దాల తరబడి పార్టీకి సేవ చేస్తుమని నిన్న మొన్న పార్టీలోకి వచ్చి పదవులు అనుభవించడంతో పాటు సీట్ల దందా ప్రారంభించి పార్టీని మట్టు బెట్టడానికి ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్టీకి రాజీనామా చేసిన నాయకులు, నేతలు స్వంత అజెండాతో ముందుకు సాగాలని యోచిస్తున్నారు. ఎవరికి వారు స్వతంత్ర్య అభ్యర్థులుగా బరిలోకి దిగాలని ఆలోచిస్తున్నట్లు సమాచారం. కాగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ మేకల శివారెడ్డి అధిష్టానం తీరుపై భగ్గుమన్నారు. దశాబ్దాలుగా పార్టీకి పని చేసి పెద్ద దిక్కుగా ఉంటున్న నాయకులను పక్కన పెట్టిన అధిష్టానం కార్యకర్తలకు ఏమి సందేశాన్ని ఇస్తుందని ప్రశ్నించారు. ఇలా వ్యవహరిస్తే కార్యకర్తలు, యువకులు పార్టీకి ఎలా పని చేస్తారన్నారు. రేవంత్‌రెడ్డి మాటలు కోటలు దాటుతాయి చేతలు ఇలా ఉండటం బాధాకరమన్నారు. తాను కూడా ఇక నుంచి పార్టీకి పని చేయనని సూచన ప్రాయంగా తెలిపారు.

## మల్కాజిగిరి అభ్యర్థి మైనంపల్లి హన్మంతరావు



పేరు: మైనంపల్లి హన్మంతరావు
తండ్రి: ఎం. కిషన్‌రావు, సరోజిని
వయస్సు: 57
భార్య: మైనంపల్లి వాణి
కుమారులు: రోహిత్, శివాంక్
నివాసం: అశోక బిల్డర్స్ దూలపల్లి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా
జననం: 1966 జనవరి 10

- మెదక్ జిల్లా, కొర్విపల్లిలో జన్మించారు.
- ఇంటర్మీడియేట్
- 2008 ఉప ఎన్నికల్లో మెదక్ జిల్లా రామాయంపేట నుంచి టీడీపీ తరపున పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2009 ఎన్నికల్లో మరోసారి గెలుపొందారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం 2014లో టీఆర్ఎస్ పార్టీలో చేరి మల్కాజిగిరి ఎంపీగా పోటీ చేసి ఓటమి చవి చూశారు. 2018లో టీఆర్ఎస్ తరపున మల్కాజిగిరి ఎమ్మెల్యేగా గెలుపొందారు.
- 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగనున్నారు.

గెలుపు..ఓటములు

2018లో మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి ఎన్. రాంచందర్‌రావుపై 73 వేల 6098 ఓట్లతో గెలుపొందారు. 2017లో ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2015లో టీఆర్ఎస్ గ్రేటర్ అధ్యక్షుడిగా పని చేశారు. 2014 పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్‌కు టీఆర్ఎస్ తరుపున పోటీ చేసి తన సమీప టీడీపీ అభ్యర్థి మల్లారెడ్డిపై ఓటమి పాలయ్యారు.

బయోడేటా..

## ఉప్పల్ అభ్యర్థి మందముల పరమేశ్వర్‌రెడ్డి



ఉప్పల్: ఉప్పల్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా మందముల పరమేశ్వర్ రెడ్డి పేరును అధిష్టానం ఖరారు చేసింది. ఈ మేరకు ఆదివారం జాబితాను విడుదల చేసింది.

పేరు: మందముల పరమేశ్వర్‌రెడ్డి
తండ్రి పేరు: మందముల క్రిష్టా రెడ్డి
వయస్సు: 43 సంవత్సరాలు
విద్యార్హత: బీ.కాం
వృత్తి: వ్యాపారం
భార్య: రజిత పరమేశ్వర్‌రెడ్డి. ప్రస్తుతం ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్‌గా ఉన్నారు.
సంతానం: కుమారుడు, కుమార్తె
చిరునామా: ఉప్పల్, భరత్‌నగర్ కాలనీ
ప్రస్తుతం పార్టీలో: ఉప్పల్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ ఏ- బ్లాక్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు.

రాజకీయ నేపథ్యం..

- 2009లో జీహెచ్ఎంసి కార్పొరేటర్‌గా కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్నికయ్యారు. స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడి పని చేశారు.
- 2016 జీహెచ్ఎంసీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పరమేశ్వర్ రెడ్డి భార్య రజిత పరమేశ్వర్ రెడ్డి పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు.
- తిరిగి 2020లో ఆమె కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు.

# కాలనీలను నిషేధిత జాబితాలో చేర్చొద్దు


సమావేశమైన కాలనీల ప్రతినిధులు

రామంతాపూర్ : పెద్ద చెరువు ఆక్రమణలపై ఇటీవల తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ అధికారులు చెరువు బఫర్ జోన్‌లో ఉన్న సర్వే నెం.42, 43, 44 పార్ట్, 63 నుంచి 66, 30 సర్వే నెంబర్లలో ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్లను గుర్తించి ఈ ప్రాంతాల్లో ఎలాంటి భవన నిర్మాణాలు అనుమతులు, అమ్మకాలు, రిజిస్ట్రేషన్లు చేయవద్దని జీహెచ్ఎంసీ ఇరిగేషన్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆదివారం ఆయా సర్వే నెంబర్ల పరిధిలోకి వచ్చే సాయి చిత్రానగర్, రవీంద్రనగర్, లక్ష్మీ నగర్ కాలనీ, మహేశ్వరినగర్‌లో కాలనీ వాసులు స్థానిక వీరా రాజారెడ్డి పార్కులో సమావేశమయ్యారు. గతంలో తమకు గృహ నిర్మాణాలు, అపార్టుమెంట్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చి స్థలాలను నిషేధిత జాబితాలో చేర్చడంపై ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా కాలనీల ప్రతినిధులు మాట్లాడుతూ త్వరలోనే జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, ఇరిగేషన్ అధికారులను కలిసి తమకు జరుగుతున్న అన్యాయాలపై వినతి పత్రాలు అందజేస్తామన్నారు. సమస్య పరిష్కారం కాకపోతే న్యాయ పోరాటాలు చేపట్టాలని తీర్మానించారు. కార్యక్రమంలో కాలనీల ప్రతినిధులు రుద్రశేఖర్, నాగేష్, కంచర్ల స్వామిరెడ్డి, మహేందర్ గుప్తా, రాఘవరెడ్డి, ఉపేందర్, విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో దేవీ నవరాత్రులు


దుర్గా భవానీ ఆలయంలో..


బాల త్రిపుర సుందరిగా


జ్ఞాన సరస్వతీదేవిగా


బాలా త్రిపురసుందరిగా


మల్లన్న దేవాయంలో...

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జునగర్ మల్లన్న దేవాలయం, గౌతంనగర్‌లోని దుర్గా భవానీ ఆలయం, ఉత్తంనగర్‌లోని దుర్గా జ్యోతి ష్యాలయంలో దేవి నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అమ్మవారికి హోమాలు నిర్వహించారు.

**బాల త్రిపుర సుందరిగా అమ్మవారు..**

రామంతాపూర్ : గోఖలేనగర్‌లోని శ్రీ భూనీలా సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలోని ఊర పోచమ్మ దేవాలయంలో దేవీ శరన్నవరాత్రులు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని బాలాత్రిపుర సుందరి దేవీగా సర్వాంగ సుందరంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కక్కిరేణి హరీష్‌తో పాటు దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

**విశేష అలంకరణలో అమ్మవారు...**

బోడుప్పల్: పెంటారెడ్డి కాలనీలోని శ్రీమాతా నిమిషాంబిక దేవి అమ్మవారిని ఆదివారం శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మొదటి రోజు రజత కవచాలంకృత విశేష అలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

**మల్కాజిగిరిలో...**

మల్కాజిగిరి:మల్కాజిగిరి, ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ల పరిధిలోని పలు దేవాలయాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మారుతీనగర్ ఆంజనేయస్వామి దేవాలయంలోని అన్నపూర్ణాదేవి ఉపాలయంలో అమ్మవారిని బాలా త్రిపుర సుందరిగా, అనంత సరస్వతీనగర్‌లోని జ్ఞానసరస్వతీ ఆలయంలో జ్ఞానసరస్వతీ దేవిగా దర్శనమిచ్చారు. కార్యక్రమాల్లో ఈవోలు రవీందర్‌రెడ్డి, వెంకన్న, భక్తులు పాల్గొన్నారు. పలు కాలనీల్లో మండపాలను ఏర్పాటు చేసి నిర్వాహకులు శరన్నవరాత్రులు ప్రారంభించారు.

### పంతం నెగ్గించుకున్న మైనంపల్లి

కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షం

మల్కాజిగిరి: మల్కాజిగిరి అభ్యర్థిగా ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, ఆయన కుమారుడు రోహిత్‌ను మెదక్ అభ్యర్థిగా టికెట్లు కేటాయించడంతో మల్కాజిగిరి కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. తన కుమారుడికి మెదక్ టికెట్ కోసం ప్రయత్నించిన మైనంపల్లి హన్మంతరావుకు బీఆర్ఎస్ టికెట్ ఇవ్వడానికి నిరాకరించడంతో , ఆయన పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. తనతో పాటు తన కుమారుడికి కూడా టికెట్ ఇప్పించుకుని తన పంతం నెరవేర్చుకున్నారు.

### అన్ని వర్గాలకు ప్రాధాన్యం


మాట్లాడుతున్న ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్

అల్వాల్: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ నందికంటి శ్రీధర్ అన్నారు. ఆదివారం అల్వాల్‌లోని మాజీ ఎమ్మెల్యే చింతల కనకారెడ్డి నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నందికంటి శ్రీధర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టి నూతన మేనిఫెస్టోలో అన్ని వర్గాల ప్రజలకు ప్రాధాన్యం ఇచ్చారన్నారు. మర్రి రాజశేఖర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, వీఎన్. రాజు, మలేష్‌గౌడ్, సంజీవరెడ్డి, చంద్రశేఖర్, మధు, వీణ మాధవి తదితరులు పాల్గొన్నారు.

### రూ.11.55 లక్షల నగదు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న నగదు

మల్లాపూర్: ఎన్నికల నేపథ్యంలో నాచారం సీఐ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాచారం వీఎస్టీ కాలనీలో వాహనాలను తనిఖీ చేస్తుండగా బైక్‌లో తీసుకెళుతున్న రూ. 9.55 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అంబర్‌పేట్‌కు చెందిన బాలకృష్ణ ద్విచక్ర వాహనంలో నగదు తీసుకెళుతుండగా పోలీసులు తనిఖీ చేశారు. ఆధారాలు చూపకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నారు. పద్మారావునగర్‌కు చెందిన యమీన్‌ఖాన్ వద్ద రూ.2 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

**ఉప్పల్‌లో..**

ఉప్పల్: సరైన ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న నగదును ఉప్పల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక గాంధీ విగ్రహం వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా గాంధీనగర్ ప్రాంతానికి చెందిన పలాది విజయ్ నుంచి రూ. 3.5 లక్షలు, హయాత్‌నగర్‌కు చెందిన అనుగు కరుణాకర్ రెడ్డి వద్ద రూ. 4.28 లక్షలను స్వాధీనం చేసుకున్న పోలీసులు ఎన్నికల ప్రత్యేక బృందానికి అప్పగించారు.

# బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేతలు

జంగ్ తెలంగాణ 2023


బీఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నేతలు

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఆదివారం బీఆర్ఎస్ ఉప్పల్ అభ్యర్థి బీ. లక్ష్మారెడ్డి సమక్షంలో కార్పొరేటర్ ప్రభుదాస్, డివిజన్ పార్టీ అధ్యక్షుడు గుండారపు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఎల్ఆర్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులమై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. అనంతరం బీఎల్ఆర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్, తనపై విశ్వాసంతో పార్టీలో చేరుతున్న వారందరికి పార్టీలో సముచిత స్థానం కల్పించి అండగా ఉంటానన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలోని సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ గెలుపుకోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుమ్మడి జంపాల్‌రెడ్డి, పూస రమేష్, దేవేందర్, రాజేందర్‌కుమార్, శ్రీధర్, శ్రీనివాస్, సతీష్, శ్రీకాంత్, నరేష్, అవినాష్, శశికాంత్, రియాజ్, కరీం తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పథకాలు నచ్చే బీఆర్ఎస్‌లో చేరిక


ఎండీ ఉస్మాన్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న రావుల శ్రీధర్‌రెడ్డి

మల్లాపూర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు పార్టీలో చేరుతున్నారని ఉప్పల్ బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్ యువదళ్ వ్యవస్థాపకుడు ఎండీ ఉస్మాన్ పార్టీలో చేరారు. ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఉప్పల్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**టీజేఎస్ నాయకుల చేరిక**

మల్లాపూర్ డివిజన్‌కు చెందిన పలువురు టీజేఎస్ నాయకుడు వెల్పుల సురేష్ మిత్ర బృందం మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి సమక్షంలో చేరారు. వారికి ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. బీఎల్ఆర్ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు.

### బీఆర్ఎస్ సంబరాలు..


హెచ్‌బీకాలనీలో సంబరాల్లో పాల్గొన్న కార్పొరేటర్ ప్రభుదాస్..

కుషాయిగూడ: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన మేనిఫెస్టో పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ, చర్లపలి డివిజన్‌లలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ మేనిఫెస్టో రూపొందించడం పట్ల బాణాసంచా కాల్చి స్వీట్లు తినిపించుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గుమ్మడి జంపాల్‌రెడ్డి, డప్పు గిరిబాబు, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, జౌండ్ల ప్రభాకర్‌రెడ్డి, నేమురి మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌లో చేరిక

అల్వాల్: ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్శితులై అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ నందికంటి శ్రీధర్ అన్నారు. ఆదివారం అల్వాల్, వెంకటాపురం డివిజన్‌లకు చెందిన పలువురు యువకులు నందికంటి శ్రీధర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపునకు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.


నందికంటి శ్రీధర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన యువత

# అభివృద్ధి, సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి


చర్లపల్లిలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తిరిగి బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తాయని చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. ఆదివారం ఆమె బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డికి మద్దతుగా చర్లపల్లి డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి బండారి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టో పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని వర్గాల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ రూపొందించిన మేనిఫెస్టో దేశంలోనే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, కనకరాజుగౌడ్, ప్రభుగౌడ్, ఆల్వా లక్ష్మారెడ్డి, సత్తెమ్మ, లలిత తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బతుకమ్మ వేడుకలు







మల్లాపూర్: బతుకమ్మ వేడుకలు మల్లాపూర్ మల్లికార్జున్ నగర్, నెహ్రూ నగర్‌లో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు, మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చారు. పాటలు పాడుతూ గౌరమ్మను కొలిచారు.

**రామంతాపూర్‌లో..**

రామంతాపూర్ : ప్రగతినగర్‌లోని టిప్పి టాయ్స్ ప్లే స్కూల్‌లో ఆదివారం నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులతో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ ఈశ్వరి మాట్లాడుతూ చిన్నారుల్లో ప్రకృతి పండుగ అయిన బతుకమ్మ వేడుకలపై అవగాహన కల్పించేందుకు వేడుకలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీపతి, గంగోత్రి, సరిత, విజయ తదితరులు పాల్గొన్నారు.

**ఉప్పల్ మినీ శిల్పారామంలో..**

ఉప్పల్: ఉప్పల్ మిని శిల్పారామంలో దసరా బతుకమ్మ సంబరాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన పలు కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. శిల్పారామం మహిళా సిబ్బంది, సందర్శకులతో కలిసి బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. మనస్విని కోసూరు శిష్యం బృందం కూచిపూడి అలరించింది. శుక్లాంభరదరమ్, దశావతార శబ్దం, పుష్పాంజలి, నానా దిక్కుల తదితర అంశాలను ప్రదర్శించి మెప్పించారు.

### గెలుపే లక్ష్యంగా పని చేయాలి


గడప గడప కార్యక్రమంలో పాల్గొన్న వజ్రేష్‌యాదవ్

బోడుప్పల్: కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆయన పలు డివిజన్‌లలో నిర్వహించిన గడప గడప కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు దోపిడీకి గురయ్యారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీతో ప్రజల ముందుకు వస్తుందన్నారు. మల్లారెడ్డి మంత్రిగా ఉండి బోడుప్పల్ కార్పొరేషన్‌కు ఒక్క రూపాయి కూడా నిధులు తీసుకురాలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న హామీలన్నింటిని అమలు చేస్తామన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు సుశాంత్‌గౌడ్, కిశోర్‌గౌడ్, కళ్యాణ్‌కుమార్, తోటకూర అజయ్‌యాదవ్, ప్రభాకర్‌గౌడ్, విశ్వంగుప్త, రమేష్, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌ను గెలిపించండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి

మల్కాజిగిరి: రెండు పర్యాయాలు గెలిచిన కేసీఆర్ మాటలను నమ్మవద్దని తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను ఈ సారి ఎన్నికల్లో గెలిపించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. ఆదివారం ఓల్డ్ నేరెడ్‌మెట్‌లో పలువురు యువకులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోను కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోను మార్చి ప్రకటించాడన్నారు. అర్హులందరికి పథకాలు అందాలన్నది కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, బీఆర్ఎస్ పాలనలో కొందరికే పథకాలు అందుతున్నాయన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు స్థానిక ముదిరాజ్,గౌడ కులస్తుల శ్మశానవాటిక సమస్యలతో పాటు పురాతన దేవాలయాల అభివృద్ధికి, మహిళా భవన్ ఏర్పాటుకు సహకరించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జీఎన్వీసతీష్‌కుమార్, వెంకటేష్‌యాదవ్,బి.కె.శ్రీను, శ్రీకాంత్‌ముదిరాజ్, సంపత్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

### కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయాలి


మురళీధర్‌రావుతో మాజీ ఎమ్మెల్యే రాజేందర్

మల్కాజిగిరి: రాష్ట్రంలో ప్రభుత్వ వ్యతిరేకతను, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మధ్యప్రదేశ్ బీజేపీ ఇన్‌చార్జి మురళీధర్‌రావు అన్నారు. ఆదివారం పద్మావతి ఫంక్షన్ హాల్‌లో మహాబూత్ నాయకులు సమ్మేళనం జరిగింది.ఈ సందర్భంగా మురళీధర్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు.ఈ సారి ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వ్యతిరేకత తప్పదని, కాంగ్రెస్‌ను కూడా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. నియోజకవర్గంలోని అన్ని పోలింగ్‌బూత్‌ల్లో ఓటర్ల జాబితాపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు హరీష్‌రెడ్డి, కర్నాటకు చెందిన మాజీ మంత్రి డాక్టర్ సుధాకర్, మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్,సదానంద్‌గౌడ్ పాల్గొన్నారు.